## కథాదీపధారిగా నిలిచిన భూపతి చంద్ర
# స్మారక కథానికల పోటీ - 2026.

ధనం ఉన్నచోట మానవ సంబంధాలు క్షీణిస్తాయి అంటారు డబ్బున్నచోట లోభత్వం పెరుగుతుంది అనికూడా అంటారు, అందుకు భిన్నంగా ఉన్నటువంటి వారిని కూడా మనం చూస్తాం.

అలాంటి కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఆయన జిల్లా పరిషత్తు చైర్మన్‌గా చేశారు.. ఆయన ఒక సోదరుడు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన దర్శకుడు, మరొక సోదరుడు విద్యావేత్త, పర్యావరణవేత్త.. ఆయన మాత్రం చాలా నిరాడంబరంగా ఉంటారు. ఈ అన్నదమ్ములు తమ తల్లిదండ్రుల స్మృత్యర్థం ఒక సేవా సంస్థను స్థాపించారు, అనుబంధంగా కథల పోటీని కూడా నిర్వహిస్తున్నారు. డబ్బు చెడ్డది కాదని నిరూపిస్తున్నారు.. డాబు నివ్వదని కూడా ప్రూవ్ చేస్తున్నారు.. *భూపతి చంద్ర* స్మారక కథల పోటీ బహుమతికి కొల్లూరు నుంచి బొగ్గులకుంటకు క్యాబ్‌లో వెళుతుంటే ఆ వ్యక్తి తాలూకు వ్యక్తిత్వం కళ్ళముందు కదలాడి ఇలాంటి అరుదైన వ్యక్తులు కూడా ఉంటారు కదా అనుకున్నాను.. ఆత్మీయ పలకరింపు.. అవధులు లేని తృప్తి ఆయన మోహంలో దోబూచులాడుతుంది.. ఆయనే ఎమ్.ఎల్.కాంతారావు.. ఆయన సోదరులు దర్శకుడు బి.నర్సింగరావు, వేదకుమార్‌లు.. వారి ఆలోచనల్లో ఉండగానే క్యాబ్ సారస్వత పరిషత్తు ముందు ఆగింది..

ఎమ్.ఎల్.కాంతారావు గారు సహృదయులు.. సాహిత్యాన్ని, సినీ సంగీతాన్ని అమితంగా ప్రేమిస్తారు. ఆయన పరిచయమయిన వారికి ఆ సంగతి సుస్పష్టం. వారి సోదరులు బి.నర్సింగరావు (దర్శకులు), వేదకుమార్ (విద్యా పర్యావరణవేత్త), అశోక్‌లకు ఆయనంటే గౌరవంతో కూడిన భక్తి. వీరి బావమరిది శ్రీ నరసింగరావు గారికి బావగారంటే ఆరోప్రాణం.



వేయి పున్నముల రేడు

ఈ సోదరులంతా మొదట్లో తమ తండ్రిగారు 1993లో శివైక్యం చెందినప్పుడు వారి పట్ల గౌరవ సూచకంగా *మణికొండ భూపతిరావు* మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత వారి తల్లిగారు చంద్రమ్మ గారు 1999లో గతించినప్పుడు ఆ ట్రస్ట్ పేరు *భూపతి చంద్ర* ట్రస్ట్ గా మార్చి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆవిధంగా తల్లిదండ్రుల పట్ల తమ ప్రేమను చాటుకున్నారు. ఈ సోదరులలో పెద్దవారయిన కాంతారావు గారు కథానిక ప్రేమికులు.. అందుచేత *భూపతి చంద్ర* స్మారక కథానికల పోటీని గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. బహుమతులు అందజేస్తున్నారు.. తెలంగాణ సారస్వత పరిషత్తు ఈ కార్యక్రమానికి వేదికగా నిలుస్తోంది.

ఈ సంవత్సరం ఫిబ్రవరి పందొమ్మిదవ తేదీన ఆ వేడుక నిర్వహించారు. ప్రతిసంవత్సరం ఫిబ్రవరి పందొమ్మిదవ తేదీన ఆ వేడుక జరుగుతుందని ప్రకటించారు.. దానికి కారణం తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఫిబ్రవరి 19వ తేదీ కాంతారావు గారి జన్మదినం. ఈ సంవత్సరం వారు ఎనభై మూడు పూర్తిచేసి ఎనభై నాలుగులో అడుగు పెట్టారు. సహస్రచంద్రదర్శనం చేసుకున్నారు అంటే జీవితంలో వెయ్యి పున్నములు దర్శించిన ధన్యజీవయ్యారు వారు.

కాంతారావు గారికి పాత తెలుగు, హిందీ సినిమా పాటలను ప్రేమిస్తారని చెప్పాను కదా. సరిగ్గా ఆరుగంటలకు వేదికపై ఎల్.ఈ.డి. స్క్రీన్ అమర్చి ముప్పై ఐదు నిముషాల పాటు ముచ్చటగొలిపే నలుపు తెలుపు చిత్రాల పాటలు ప్రదర్శించి సభికులను ఆశ్చర్యపరిచారు. సినీగీతాల ప్రదర్శన అవగానే సభంతా కరతాళధ్వనుల మిన్నుముట్టాయి. అప్పటికి సభలో పాల్గొనేందుకు అతిథులు వచ్చేశారు.. సభంతా కథాభిమానులతో కిటకిటలాడుతోంది. ఆనాటి సభలో ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ సమన్వయ సలహాసంఘం (తెలుగు) అధ్యక్షులు ఆచార్య సి.మృణాళిని పాల్గొన్నారు. విశిష్ఠ అతిథిగా పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్, గౌరవ అతిథిగా కథారచయిత ఖదీర్ బాబు, ఆత్మీయ అతిథిగా దర్శకులు నర్సింగరావు పాల్గొన్నారు..

సభాధ్యక్షత వహించిన ఎమ్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ గత సంవత్సరం నూట యాభై కథలు పరిశీలనకు వస్తే ఈసారి మూడువందల పదిహేను కథానికలు పోటీకి ఎంట్రీలుగా వచ్చాయని తెలియచేశారు. రెండుదశల్లో పోటీ కథానికల వడపోత జరిగిందని చెప్పారు. ప్రాథమిక పరిశీలనలో మొత్తం పదిమంది న్యాయనిర్ణేతలు అరవై ఏడు కథలను ఎంపిక చేశారని, రెండవదశలో ఇద్దరు సీనియర్ విమర్శకులు కె.పి.అశోక్ కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఎస్.రఘు ఆ కథలను విశ్లేషించారని, వాటిల్లోంచి ఎనిమిది కథలను ఎంపిక చేశారని చెప్పారు. వాటిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ఐదు కథలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించామని చెప్పారు. ఈ కథల పరిశీలన, అత్యంత గోప్యంగా జరిగిందన్నారు. పోటీకి వచ్చిన కథల ఎంపిక చాలా కఠినంగా, ఖచ్చితంగా జరిగిందని చెప్పారు. ఎంట్రీలు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా చెన్నై, బెంగళూరు నగరాల నుంచి ఇంకా ఒడిస్సా, మహారాష్ట్రల నుంచి రావటం విశేషం అన్నారు.

ఈ కథల పోటీలో మొదటి బహుమతి సుంకోజి దేవేంద్రాచారి (అంతర్థానం)

రెండవ బహుమతి పొత్తూరి సీతారామరాజు (పులి నెత్తుటి ముగ్గు)

మూడవ బహుమతి పుప్పాల కృష్ణ మూర్తి (కన్నీట వసంతం) గెలుచుకున్నారు..

ఇక ప్రోత్సాహక బహుమతులు పొందిన వారిలో డా.ఎమ్. సుగుణరావు, చొక్కర తాతారావు, మొయిద శ్రీనివాసరావు, ఉయ్యూరు అనసూయ, ఇంద్రగంటి మధుసూదనరావు ఉన్నారు.

రాయటం ఎంత ముఖ్యమో చదవటం అంత ముఖ్యం, దానివలన రచయిత అభివ్యక్తి బలపడుతుందన్న ముఖ్యఅతిథి సి. మృణాళిని గారి మాట ఎంతో విలువైనది. అలాగే మరో అతిథి కె.శ్రీనివాస్ కథా రచనలో చారిత్రక, పరిశోధనా కోణాలు ముఖ్యమన్న అంశం కూడా. కథా రచయిత ఖదీర్ బాబు అన్నట్టు పత్రికలు అరుదైపోతున్న సమయంలో ఇటువంటి కథల పోటీలు రచయితలకు ఉత్ప్రేరకాలుగా నిలుస్తాయనటంలో సందేహం లేదు.

బహుమతులు అందుకున్న రచయితలు తమ స్పందనలను తెలియజేశారు.. న్యాయ నిర్ణేతల తరఫున కె.పి.అశోక్ కుమార్ ప్రసంగిస్తూ బహుమతి పొందిన వారి పేర్లను పత్రికా ముఖంగానే తెలుసుకోగలిగామని కేవలం రచన ఆధారంగానే కథల ఎంపిక జరిగిందని వివరించారు .. అలాగే వస్తు వైవిధ్యంతో పాటు శిల్పపరంగా బావున్న కథలను ఎంపిక చేశామని వివరించారు.. ఆకాశవాణి విశ్రాంత సహాయ సంచాలకులు సి.యస్.రాంబాబు సభను నిర్వహించారు..

ఎటువంటి వివాదాలకు తావులేకుండా, నిష్పక్షపాతంగా నిర్వహించిన భూపతిచంద్ర స్మారక కథానికల పోటీ నిర్వాహకులను అభినందించాలి. ఎంతో క్రమశిక్షణతో ఆనాటి సభ సాగటానికి కృషి చేసిన కాంతారావు గారి సోదరులు వేదకుమార్, బి.నర్సింగరావు, కాంతారావు గారి బావమరిది నరసింగరావు గారికి ప్రత్యేక అభినందనలు తెలియచేద్దాం.

**- మిసిమి / సి.యస్.రాంబాబు**

నిన్న మధ్యాహ్నం – నిద్రమత్తు – అన్నం మత్తు అరఘడియ అన్నారు – ఎక్కడో మెలకువలో కలవరింతలా ఏదో సంగీతం – సంతోషం కలగంటున్నావా? మీ ఫిబ్రవరి సంచిక ఆసాంతం చదివాను. అదేమయ్యా – గాజుల జాజర అన్నావు? ఆస్కార్‌వైల్డ్‌కి – అశ్విని వాచకమా? జీవన మకరందం! బాషా గారి దరిశి చెంచయ్య – నన్ను అబ్బురపరిచింది – శేషగిరి రావు 'మింక్స్ మౌన బాధ'ను అనుభవంలోకి తెచ్చారు.

అప్పాజోస్యుల గారితో సంభాషణ – ఎన్నో సంగతులు తెలియచేస్తుంది. వారికీ – మీకూ అభినందనలు – బెజవాడ జ్ఞాపకాలు – నాకు ఒక నాస్టాల్జియ. ఆర్.వి. చలంతో నాకు పరిచయం కాదు – కలిసి పనిచేసాము. చిరంజీవి సుధారాణి పరిశోధన – దక్షిణాదిన తెలుగు పాలకుల శకలాలను సజీవంగా చిత్రిస్తున్నారు.

మా పద్మావతి – లక్ష్మీప్రియ – మునికిష్టడి మాణిక్యం – ఎంతో ఇష్టంగా చదివాను! శివారెడ్డి కవిత్వాన్ని – మంచుకొండలపై నడక – అనటం వచన కవిత్వానికి మంచుపూల అభిషేకం – రాజారామ్మోహనరావు సభావిశేషలు సజీవంగా వున్నాయి. ఆయనకు ఎనభై–ఆయన కథకు అరవై! అశ్వినిగారు – మిమ్మల్ని అభినందిస్తున్నాను అంటే, సాధారణ విషయం.

'**మిసిమి**' మీ చేతిలో చిరంజీవి!

ఎవ్వరూ ఇన్ని విషయాలు ప్రత్యేకంగా ఫోనులో చెప్తున్నారు? ఓ ఉత్తరం రాయవచ్చు కదా! అదీ అయింది – ఆయన రాయరు – ఎందుకు రాయరో చెప్పారు. అదలా వుంచేద్దాం – అయితే ఈ ట్రాన్స్ స్క్రిప్ట్‌కి ఆయన అనుజ్ఞ పొందాను. ఎవరీయన?

– – – –

## క్యాబ్ కథలు

**కాం**తారావు గారి సభకు వెళుతున్నాను. క్యాబ్ తిలక్ రోడ్డుల్లోకి, అబిడ్స్ బాటా పక్కనుంచి తిరిగింది. 'సార్! ఈ రోడ్డులోనే చెప్పులు లేకుండా రెండేళ్లు తిరిగాను'. అతని కళ్లు తడిసిపోయాయి. క్యాబ్ స్లో చేశాడు. సారస్వత పరిషత్ దాటిపోయినట్లుంది. వెనక్కి తిప్పి, 'హైదరాబాద్‌లో బ్రతకటానికి వచ్చిన నా కెప్టెన్ చెప్పిన విషయాలు ఎక్కడో విన్నట్టుంది.

ఇట్లాంటిదే – సార్! మాది కాకినాడ. మేము ఏడుగురం. హైస్కూల్ దాటలేదు. మొదట్లో మాలో ముగ్గురు ఈ హైదరాబాద్‌లో బ్రతకటానికి వచ్చారు. వాళ్లు కుదురుకున్న తరువాత మా నలుగుర్ని రమ్మన్నారు. కట్టుబట్టలతోనే వచ్చాం. ఏడుగురం రెండు, మూడు గదుల్లో సర్దుకున్నాం. ఇప్పటికి ఏడెనిమిదేళ్లయింది. ఇద్దరు ఇళ్లు కొనుక్కున్నారు. ఇంకా ఐదుగురం రెండు గదుల్లో కాలక్షేపం చేస్తున్నాం. అందరం ర్యాపిడో, ఊబర్ నడుపుతున్నాం. ఈ డిసెంబర్‌కి అన్ని బళ్లు తీరిపోతాయి. ఇంకా ఏమో.. ఏమో.. చెప్తుంటే – బ్రతకటానికి నగరానికి వచ్చిన విషయం లీలగా గుర్తుకు వస్తోంది. అవును ఈరోజు ప్రజావాణిలో ఆ పుస్తకం సమీక్ష చదివాను. అంతకుముందు రెండేళ్ల క్రిందట అక్కినేని కుటుంబరావు పుస్తకం ఆత్మీయుల సమక్షంలో ఆవిష్కరణకు ఓల్గా గారు పిలిస్తే వెళ్లాను. నగరంలో బ్రతకటానికి వచ్చినవారు ఎంతమందో! ఎన్నిదిక్కుల్లో ఉన్నారో? నిన్న పైరేట్ ప్రసాద్ గారి విల్లా – జమ్ ఎస్టిల్లా కూబర్‌కి వెళ్లాను. ఆశ్రమంలో ఫ్రాంక్స్ క్యాబ్ కెప్టెన్ రాజు నవ్వుతూ పలకరించాడు. క్యాబ్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ – 2లో దిగి, సర్వీస్ రోడ్‌లో నుంచి విల్లా – 63 దగ్గర ఆగింది. రాజు అన్నాడు – సార్ ఆ పక్కనే కాలనీలో మా ఇల్లు. టు బెడ్రూమ్ అపార్ట్‌మెంట్ ఎలాట్‌మెంట్‌లో వచ్చింది అన్నాడు. 'రాజు చాలా సంతోషం'. ఇదిగో ఉంచుకో అని ఘనంగానే ముట్టచెప్పి పంపించాను.

కృషితో నాస్తి దుర్భిక్షం.

– – – –

## కృష్ణ గానామృతం

**కొం**తమంది కొన్నింటికి అంకితమై ఉంటారు.

వయసుతో సంబంధం లేకుండా ఉత్సాహంగా తమకిష్టమైన పనిని చేస్తుంటారు.. ఆకాశవాణి నుంచి పదవీ విరమణ చేసి పదేళ్లకు పైగానే అయినా లలిత సంగీతానికి అంకితమైపోయిన వ్యక్తి మిత్రుడు కలగ కృష్ణ మోహన్. లలిత సంగీతానికి సంబంధించి నిరంతరం ఏదో ఒక కార్యక్రమం త్యాగరాజ గాన సభలో నిర్వహించటం అతనికి అలవాటు. ప్రతిసంవత్సరం తన గురువు పాలగుమ్మి విశ్వనాథం గారి స్మృతిలో అవార్డులిస్తాడు. లలిత సంగీతంపై సోదాహరణ ప్రసంగాలు ఏర్పాటుచేసి ఇంకా లలిత సంగీతం బతికే ఉందని గుర్తు చేస్తాడు. నిజానికి వీటి నిర్వహణకు ఎవరి దగ్గర చేయి చాపడు. నిర్వికార నిర్మోహత్వంతో చేసేస్తుంటాడు..

అలాంటి కార్యక్రమం ఫిబ్రవరి 23వ తేదీ, సోమవారం, త్యాగరాజ గానసభలో నిర్వహించాడు. ఈసారి ఘంటసాల లలిత గీతాలను దాదాపు పది పన్నెండు మంది గాయనీ గాయకుల చేత పాడించాడు. ఘంటసాల ప్రైవేట్ రికార్డులంటే చెవికోసుకునేవారికి పండగే. ఆరుగంటలకు అంటే ఏడు చేయకుండా కేవలం పదినిముషాలు ఆలస్యంగా మొదలయింది కార్యక్రమం. నిత్యం సినిమా పాటలతో హోరెత్తే త్యాగరాజ గానసభ హాయిగా, మంద్రంగా, నిర్మలమైన వాతావరణంలో నమో వెంకటేశ అనే ఘంటసాల భక్తిగీతంతో మొదలయింది. రెండుగంటలు లలిత గీతాలాపన వీనుల విందుగా జరిగింది.



కృష్ణ ది కండక్టర్

పాడిన కళాకారులందరూ రేడియో, దూరదర్శన్‌ల్లో దశాబ్దాలుగా మనలను అలరించినవారే.. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ఒకప్పుడు సినిమా హాళ్ళకు ప్రసిద్ధిగా ఉండేది.. ఇప్పుడు వాటి జోరు తగ్గి, కల్చరల్ మల్టీప్లెక్స్ త్యాగరాజ గానసభ మూడు కార్యక్రమాలు, ఆరు సన్మానాలుగా సాగుతుండటం సంతోషించాల్సిన విషయం. కృష్ణమోహన్, లలిత సంగీతాన్ని అభిమానించేవారందరూ ఆరోజు ప్రేక్షకులుగా అమితానందాన్ని పొందారు.. తెల్లటి ప్యాంట్, తెల్లటి షర్ట్ ఇది కృష్ణ మోహన్ ట్రేడ్ మార్క్ డ్రెస్ కోడ్.. ఉదయం అంతా రిహార్సల్స్ నిర్వహించి సాయంత్రానికి వయసు రీత్యా డస్సిపోయినా ఛలోక్తుల పరంపర ఆగలేదు.. ఇలా రెగ్యులర్‌గా లలిత సంగీత కార్యక్రమాలు నిర్వహించటం కూడా ఒక వ్యసనమే కానీ మంచి వ్యసనం.. వంశీ సంస్థ వంశీ రామరాజు, దూరదర్శన్ ప్రయోక్త వోలేటి పార్వతీశం, డా.ఎమ్.పురుషోత్తమాచార్య, వల్లభనేని అశ్విని కుమార్, సి.యస్.రాంబాబు, లలిత సంగీత గాయకులు కె.ఎస్.ఆర్.మూర్తి వంటి ఎందరో కృష్ణ మోహన్ మిత్రులు హాజరై ఘంటసాల మధుర లలిత గీతాలు ఆస్వాదించారు.

---

**మరపురాని మహనీయులు** పుస్తకావిష్కరణ సి.ఆర్. ఫౌండేషన్ ప్రాంగణంలో నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో డా. లక్ష్మీరెడ్డి అధ్యక్షతన జరిగింది. దీని రచయిత డా. నాగసూరి వేణుగోపాల్. ఇతరుల విశిష్టతను చెప్పినపుడు ఆయనకు కలిగిన అనిర్వచనీయమైన ఆనందాన్ని జీవన మాధుర్యం అన్నారు. గొప్ప వ్యక్తులు మన జీవితంలోకి ఏదోరకంగా రావటమో, మరోరకంగా స్పృశించటమో జరిగినపుడు వారి ప్రభావ ప్రకాశం మనమీద ప్రసరిస్తుంది. తన అనుభవాలను అనేక సందర్భాలలో వ్యాసాలుగా అనేక పత్రికలలో ప్రచురించారు **మిసిమి**తో సహా నాగసూరి. ఆ వ్యాస సంపుటి అరవైనలుగురు విశిష్ట వ్యక్తుల పరిచయాలను తన అనుభవం ద్వారా మనకు తెలియజేస్తే – అవి పరిశోధక విద్యార్థులకు ఒక దారి దీపంగా మనగలదు. ఆవంత్స సోమసుందరం, మాలతీచందూర్, కె. సదాశివరావు, తుమ్మల వేణుగోపాలరావు, కస్తూరి రంగరాజన్, సముద్రాల లక్ష్మణయ్య, రాఘవాచారి, కొల్లూరి కోటేశ్వర రావు, కుష్వంత్ సింగ్ – ఇదంతా ఇరవయ్యో శతాబ్దపు అనేక రంగాలలోని విశిష్ట వ్యక్తుల చరిత్రగా నడుస్తోంది. చదవండి, అందరిని కలిసి – మెలిసినట్టుంటుంది.



డా. నాగసూరి, డా. లక్ష్మీరెడ్డి

– ఎ.కె.

## మిసిమి బొమ్మ

**మి**త్రులు, శ్రేయోభిలాషులు అడుగుతుంటారు – ఎందుకు మీరు సుందర వదనల బొమ్మలతో **మిసిమి**ని అలంకరిస్తారు? అని.      ఎందుకంటే ......

సౌందర్యం అంటే స్త్రీ – సహనం అంటే స్త్రీ
లావణ్యం అంటే స్త్రీ – ప్రకృతి అంటే స్త్రీ – ఋతువు అంటే స్త్రీ
స్త్రీ అంటే భూమి – స్త్రీ అంటే విశ్వం
స్త్రీ అంటే మహాసముద్రం – స్త్రీ అంటే హిమాలయం
స్త్రీ అంటే ఉత్తుంగతరంగ గంగ
సంతోషం అంటే ఆమె – దుఃఖం అంటే ఆమెదే
వెన్నెల అంటే ఆమె హృదయం – ఆ హృదయం మల్లెల పందిరి
ఆమె ప్రేమ పారిజాతం – ఆమె దయ దిగంతం
ఆమె కోపం అగ్నిపర్వతం – ఆమె పగ లావా
ఆమె పిలుపు వేయి కోయిలల స్వరాలు –
ఆమె వేదన మానవజాతి వేదన
ఆమెకు అస్తిత్వ సమస్యే లేదు – నేనెవరినని ఎప్పుడూ అనుకోదు
నేను అమ్మనంటుంది – నేను అక్కనంటుంది – నేను ప్రియురాలినంటుంది
నేను క్షీరసాగరమంటుంది – నేను సంసారమంటుంది
క్షమాపయోధినవుతుంది – మౌనభాషణమవుతుంది
తానే విద్య – తానే పూజ – తానే పూజాఫలం
సావిత్రి తానే – శకుంతల తానే – నేనే సీతనంటుంది
ద్రౌపది తానే – సైరంధ్రిని తానే – స్త్రీ అంటే అనంతం
అందుకే స్త్రీ మూర్తులు **మిసిమి**ని అలంకరిస్తారు.



***అగ్రజా – శరణాగతి అంటూ వచ్చి ఈ పదం వచ్చింది –***
***రాసిపెట్టు అని అడిగేవాడు. అలా అడిగిందే – ఈ పది లైన్లు***

*(స్త్రీ మూర్తి పరంగా అందెశ్రీ చెప్పిన వంద లైన్లలో చివరి పది లైన్లు)*

నిత్యము నిప్పుల కొలిమిన కాలుతు / నింగిని తాకిన సింగిడి నేనే
కాలనిదెప్పుడు ఆకలి మంటల / కన్నీటి జలపాతము నేనే
పురుషాధిక్యత పుడమిన నిలబడి / శివమెత్తిన సివంగిని నేనే
సహనములో భూదేవిని నేనే / సమరాంగన ధర శాంతిని నేనే
క్రాంతిని, లోకపు భ్రాంతిని నేనే / చరాచర శరఘాతము నేనే

